
పారిశ్రామిక రథసారథీ.. నీతోనే అనంత ప్రగతి..





- కియ వచ్చింది.. కరెన్సీ తెచ్చింది..
- వలసలకు చెక్.. సొంతూర్లోనే ఉపాధి..
- భవిష్యత్తుపై ధీమా
- పారిశ్రామికాభివృద్ధితో అంతర్జాతీయ దిగ్గజాల చూపు
- ఉమ్మడి జిల్లాకు మహర్దశ
- వైసీపీ పాలనలో కొత్త పరిశ్రమల జాడేదీ?
- జలగలలూ లేవు..
- చంద్రబాబుపైనే జిల్లావాసి ఆశలు

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి



నాడు మడకశిర ఉపకాలువలో కృష్ణమ్మ పరుగులు

ఒకప్పుడు ఉమ్మడి అనంత జిల్లా అంటే అతి తక్కువ వర్షపాతం, కరువు అని చెప్పుకునే పరిస్థితి. ఇలాంటి జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రతినబూనారు. ఎన్టీఆర్ మానసపుత్రిక హంద్రీనీవా పథకం ద్వారా జిల్లాలో వందలాది చెరువులను నింపడానికి చంద్రబాబు రాత్రింబవళ్లు శ్రమించారు. కాలువ గట్లపై నిద్రించారు. పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇతర రాష్ట్రాలతో పోటీ పడి అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమను కరువు జిల్లాకు తీసుకొచ్చారు. కియ, అనుబంధ సంస్థల ఏర్పాటుతో జిల్లా రూపురేఖలు మారిపోయాయి. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించాయి. వాహన తయారీకి జిల్లా హబ్‌గా మారిపోయింది. ప్రపంచ పారిశ్రామిక వేత్తల చూపు జిల్లాపై పడింది. బెంగళూరు-అనంతపురం పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. దీంతో జిల్లా వాసి భవిష్యత్తుపై ఎన్నెన్నో ఆశలు పెంచుకున్నాడు. ఆ తర్వాత వైసీపీ అధికారంలో రావడంతో అన్నీ తల్లకిందులయ్యాయి. ప్రకటనలే తప్ప.. జిల్లా అభివృద్ధికి చేసింది ఏదీలేదన్న విమర్శలు అన్నివర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఏఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేసింది లేదు. కొత్త పరిశ్రమ ఏర్పాటైంది కూడా లేదు. దీంతో ఉపాధిలేక యువత జీవనోపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసీపీ శిలాఫలకాలు, భూమిపూజలే తప్ప క్షేత్రస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేసింది లేదు. ఇంకెన్నాళ్లు మోసగిస్తారని జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రగతి రథసారథి చంద్రబాబుపై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.



గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద జలహారతి ఇస్తున్న చంద్రబాబు (ఫైల్)

ఏపీకి ల్యాండ్ మార్క్.. కియ..

టీడీపీ హయంలో 2016 జూలై 22న దక్షిణ కొరియాకు చెందిన కియ బృందం ఉమ్మడి అనంత జిల్లాలోకి అడుగు పెట్టింది. పలు రాష్ట్రాల్లో భూములను అన్వేషించింది. ఆగస్టు 12న మరోసారి పెనుకొండ మండలం అమ్మవారుపల్లి, ఎర్రమంచి వద్ద ప్రతినిధులు పరిశీలించారు. ఇతర రాష్ట్రాలు వల వేసినా.. చంద్రబాబు ప్రత్యేక చొరవతో పెనుకొండ ఎర్రమంచి వద్ద కార్ల పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చారు. 2017 ఏప్రిల్ 20న అమరావతిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో కియ మోటార్స్ ప్రతినిధులతో ఒప్పందం కుదిరింది. 2017 ఆగస్టులో పనులు ప్రారంభమయ్యాయి. జెట్ వేగంతో పనులు చేపట్టారు. అందరి అంచనాలు తల్లకిందులు చేస్తూ.. 2019 జనవరి 29న కార్ల ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. పెనుకొండ, గుడిపల్లి, రొద్దం, గోరంట్ల ప్రాంతాల్లో 37 అనుబంధ పరిశ్రమల నిర్మాణం చేపట్టారు. దీంతో పెట్టుబడుల వరద పారింది. ప్రత్యక్షంగా 19వేల మందికి, పరోక్షంగా మరో 30వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు.

జాడలేని నీరు

వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకంతోపాటు చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. పనులు ముందుకు సాగలేదు. పనులు ప్రాతిపాదనల దశలోనే ఆగిపోయాయి. జిల్లాలో ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టుల పనులు కూడా అటకెక్కాయి. టీడీపీ హయాంలో చేపట్టిన వాటినీ కూడా మరుగున పడేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మంజూరు చేసిన, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు నేటికీ ఆ దశ దాటలేదు. జిల్లాలో జిల్లేడుబండ రిజర్వాయర్ పనులు మినహా మిగిలిన సాగుతాగునీటి ప్రాజెక్టులు ప్రతిపాదనలు, శంకుస్థాపనలతోనే సరిపెట్టారు.

హంద్రీనీవా కాలువ నిండా కంపచెట్లే


హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు ఇచ్చే జీడిపల్లి-కుప్పం, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉప కాలువలు చాలాచోట్ల దెబ్బతిన్నాయి. పలుచోట్ల కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయి. ఏటా గండ్లు పడుతూ నీరు ముందుకు సాగాలంటే కష్టతరంగా మారింది. ముళ్లపొదలతో నిండిపోయింది. కాలువ విస్తరణ పనులు చేపట్టకపోగా.. ముళ్ల పొదలతో ఇరుకుగా మారింది. ఈనేపథ్యంలో నీటి ప్రవాహ వేగం నెమ్మదిస్తోంది. లైనింగ్ చేపట్టని కారణంగా కాలువలో రాళ్లు తేలాయి. హంద్రీనీవా కాలువ వెడల్పు, మరమ్మతులు, లైనింగ్ పనులకు నిధులివ్వకుండా నిర్వీర్యం చేశారు. ఈ ఏడాది హంద్రీనీవాతో నింపాల్సిన చెరువులను ఎండబెట్టారు. మార్చి వచ్చినా రిజర్వాయర్లు, చెరువులకు నీరులేక వెలవెలబోతున్నాయి.



ప్రస్తుతం వైసీపీ పాలనలో నీరివ్వక అడుగంటిన గొల్లపల్లి రిజర్వాయర్

నీటి సవ్వడులు

కరువు జిల్లాలో పంట భూములకు నీరిచ్చేందుకు చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో చొరవ చూపారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా పెనుకొండ మండలం గొల్లపల్లి వద్ద జలాశయ నిర్మాణ పనులు చేపట్టారు. 2016 డిసెంబరు 2న చంద్రబాబు గొల్లపల్లి జలాశయాన్ని ప్రారంభించి, మడకశిర ఉపకాలువకు నీరిచ్చారు. కియ మోటార్స్‌కు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని కేటాయించారు. పెనుకొండ, హిందూపురానికి ప్రత్యేక పైపులైన్ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి తాగునీరు ఇస్తున్నారు. చెరువులకు కూడా నీరిచ్చారు. 2018 జనవరి 12న ధర్మవరం చెరువుకు నీరిచ్చి, చంద్రబాబు జలహారతి పట్టారు. జిల్లాలోనే అతిపెద్దదైన బుక్కపట్నం చెరువులో 2018 జనవరి 11న జలహారతి నిర్వహించి, చెరువుకట్టపై పైలాన్‌ను ఆవిష్కరించారు. మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో వందల చెరువులకు నీరిచ్చారు. ఫలితంగా వేలాది ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చాయి. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కుప్పం కాలువ పనులు వేగంగా చేపట్టి అనుసంధానంగా వందలాది చెరువులను నింపారు.



వైసీపీ పాలనలో పరిశ్రమల ఏర్పాటుకు నోచుకోని కప్పలబండ పారిశ్రామిక వాడ

పడకేసిన పారిశ్రామిక ప్రగతి

వైసీపీ అధికారం చేపట్టడంతో జిల్లా ప్రగతి అటకెక్కింది. కియకి అనుబంధంగా ఏర్పాటుకు సిద్ధమైన పరిశ్రమలు.. ప్రభుత్వ విధానాలు నచ్చక పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి. జిల్లాలో ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటైంది లేదు. కొత్తగా ఉద్యోగావకాలు కల్పించింది లేదు. గతేడాది నవంబరులో సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, శిలాఫలకాలను ఆవిష్కరించారు. పుట్టపర్తి జిల్లా కేంద్రం కప్పలబండ, హిందూపురం పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేశారు. కప్పలబండ పారిశ్రామిక వాడకు 20016లోనే భూమి సేకరించి, అభివృద్ధి పనులు చేపట్టారు. వైసీపీ వచ్చాక ఆపనులు ఆపేశారు. ఇందులో నలభైదాకా పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమైనట్లు ఏపీఐఐసీ చెబుతున్నా.. ఓ గ్యాస్ స్టేషన్ పనులు మాత్రమే మొదలు పెట్టారు.

టీడీపీ హయంలో పెనుకొండ, పాలసముంద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర, రాళ్లఅనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద పరిశ్రమల ఏర్పాటుకు 8వేల ఎకరాలకుపైగా గుర్తించారు. 2వేల ఎకరాలు సిద్ధం చేశారు. పెనుకొండ అమ్మవారుపల్లి, కప్పలబండ, కొటిపి, గోళ్లాపురం, గుడిపల్లి వద్ద ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు నాలుగేళ్ల కిందటే పలువురు పారిశ్రామిక ఔత్సాహికులు ఎంఓయూలు చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం రాకతో వారు వెనక్కి జంక్కారు. అనువైన భూములున్నా పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలే లేరన్న చర్చలు వినిపిస్తున్నాయి.



కియ కార్ల ఉత్పత్తి ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న చంద్రబాబు, సంస్థ ప్రతినిధులు (ఫైల్)



కుమ్మరవాండ్లపల్లి సభ నుంచి వెళ్లిపోతున్న మహిళలు

మీ సభకో నమస్కారం..!

ఆసరా సభ నుంచి జారుకున్న మహిళలు

మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగిస్తుండగానే జంప్

కదిరిఅర్బన్/గాండ్లపెంట/నంబులపూలకుంట, మార్చి 3: ఆసరా చెక్కుల పంపిణీ పేరుతో పొదుపు సంఘాల మహిళలను నయానో.. భయానో.. తరలించారు. సభకు రావాల్సిందేనంటూ సీసీలు, వీఓఏలు పట్టుబట్టి వారిని తీసుకొచ్చారు. అలా సభ ప్రారంభమైందో.. లేదో.. మహిళలు ఇలా జారుకున్నారు. కదిరి మండలంలోని కుమ్మరవాండ్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై, చెక్కు పంపిణీ చేశారు. ఉదయం 11 గంటలకే మహిళలు వచ్చారు. మంత్రి మధ్యాహ్నం 12.30 గంటలకు వచ్చారు. కార్యక్రమాన్ని ప్రారంభించి, మంత్రి మాట్లాడుతుండగానే చాలామంది మహిళలు జారుకోవడం కనిపించింది. గాండ్లపెంటలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. నంబులపూలకుంటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ఆసరా సభలో జనం కరువయ్యారు. కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. మంత్రి సభలకు వైసీపీ స్థానిక ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి హాజరుకాకపోవడం గమనార్హం.



నంబులపూలకుంట సభలో ఖాళీగా కుర్చీలు

రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ వైద్యశిబిరాలు

పేదల ఆరోగ్యమే లక్ష్యం

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం, మార్చి 3: బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ పరిశోధనా కేంద్రం సంచార వైద్యశాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. హిందూపురానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆదివారం తన నివాసం వద్ద రెండోరోజు సంచార వైద్యశాల ద్వారా పరీక్షలు చేస్తున్న శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులు చేస్తున్న పరీక్షలను ఆరాతీశారు. అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడారు. మొబైల్ వాహనంలో పరీక్షలు చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన తల్లి బసవతారకం మరణానంతరం ఆమె జ్ఞాపకార్థం కేన్సర్ ఆస్పత్రిని తన తండ్రి ఎన్టీఆర్ స్థాపించారన్నారు. ఇప్పటికే వేలాది మందికి శస్త్రచికిత్సలు చేశామన్నారు. దేశవ్యాప్తంగా ఆస్పత్రికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. క్యాన్సర్ సోకితే ఆర్థికంగా చితికిపోతారన్నారు. ఆస్పత్రికి వచ్చే పేదలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. లాభాపేక్ష లేకుండా సేవాపేక్షతోనే పనిచేస్తున్నామన్నారు. ఇటువంటి ఆస్పత్రికి తాను చైర్మన్‌గా ఉండటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. హిందూపురం నియోజకవర్గ ప్రజల కోసం ఎన్టీఆర్ ఆరోగ్యసేవ రథాన్ని ఇక్కడికి తెచ్చామన్నారు. రెండేళ్లుగా అన్న క్యాంటీన్ ద్వారా రోజూ 5 వేల మందికి ఉచితంగా భోజనం అందిస్తున్నామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాస రావు, డాక్టర్ సురేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిబిరానికి వచ్చిన వారిని పలకరిస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

పల్స్ పోలియో 98.5 శాతం

పుట్టపర్తి రూరల్, మార్చి 3: జిల్లావ్యాప్తంగా ఆదివారం 98.5 శాతం పోలియో చుక్కలు వేసినట్లు జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో 0-5 సంవత్సరాలలోపు చిన్నారులు 2,09,015 మంది ఉండగా.. 2,05,865 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన 3150 మంది చిన్నారులకు 4, 5 తేదీల్లో వారి ఇళ్ల వద్దకే వెళ్లి పోలియో చుక్కలు వేస్తామన్నారు. పుట్టపర్తిలోని ఎంపీపీ స్కూల్‌లో జిల్లా వైద్యాధికారి.. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

మహమ్మారిని తరిమికొడదాం..

పోలియో మహమ్మారిని తరిమికొడదామని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కొండయ్య పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద 9వ నంబరు సచివాలయంలో పోలియో చుక్కల కేంద్రాన్ని డీఆర్వో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు పోలియో చుక్కలు వేసి, చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షిద్దామన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం అందరి బాధ్యత అన్నారు.



వెంగళమ్మ చెరువులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి

నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి, మార్చి 3: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్ కేంద్రాల్లోనూ స్పందన కార్యక్రమం ఉంటుందనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పల్స్‌పోలియో విజయవంతం

- 5 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన వైద్యసిబ్బంది
- మిగిలిన వారికి నేడు, రేపు ఇంటింటికీ వెళ్లి వేయనున్నట్లు వైద్యాధికారుల వెల్లడి

ధర్మవరం, మార్చి3: పట్టణంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. సుమారు 61 పోలియో కేంద్రాల్లో 0 నుంచి 5 ఏళ్లలోపు వయసున్న చిన్నారులకు పల్స్‌పోలి యో చుక్కలు వేశారు. 21వ వార్డు సచివాలయంలోని పోలియోకేంద్రంలో మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలు కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. పట్టణంలో ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులు 16,800 ఉండ గా.. వారిలో 16,453 మందికి పోలియో చుక్కలు వేసినట్టు వైద్యులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్, రై ల్వేస్టేషన్, కల్యాణమండపాల్లో సైతం పోలియో కేం ద్రాలను ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు కూడా ప్రభుత్వఆస్పత్రిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వారు పోలియో కేంద్రాలలోని సిబ్బందికి భోజన, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, సుదర్శన గుప్తా, రత్నశేఖర్‌రెడ్డి,నత్రసా ల ప్రసన్నకుమార్, సోలిగాళ్లవెంకటేశులు, కొండ య్య పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: పట్టణంలో 7100 మందికి గాను 6696 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు కదిరి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ హుస్సేన్ బాషా తెలిపారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలతో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రి ఆవరణలో ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

తాడిమర్రి: మండలవ్యాప్తంగా 2715 మంది చిన్నారులు ఉండగా 2664 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు తెలిపారు. నిడిగల్లులో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని యూనిసెఫ్ బృందం పరిశీలించింది.

నల్లచెరువు: మండలంలో 99శాతం పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. 4,114మంది చిన్నారులకు గాను 4,058 మందికి చుక్కలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కల్పన, అలేఖ్య, సూపర్‌వైజర్లు సుధాకర్, భారతి, రెడ్డెమ్మ, సూర్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నారాయణ, పార్మసిస్టు చిన్నయ్య, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, సర్పంచ్ పంచ రత్నమ్మ పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండల వ్యాప్తంగా 98.5 శాతం పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు ఆయేషా, ఆనంద్‌వర్ధన్ పేర్కొన్నారు. 4,427మంది చిన్నారులకు గాను 4,361మందికి చు క్కలు వేశామన్నారు. మిగిలినవారికి 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేస్తామన్నారు. 60 పోలియోబూత్‌లు ఏర్పాటు చేసి పల్స్ పోలియో నిర్వహించామన్నారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియోలో 97శాతం చు క్కలు పిల్లలకు వేసినట్లు వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ తెలిపారు. మండలవ్యాప్తంగా 4,854 మం ది చిన్నారులుండగా, 4,710మందికి చుక్కలు వేశామన్నారు. మిగిలిన పిల్లలకు ఇంటింటికెళ్లి రెండు రోజుల్లో వేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: మండల వ్యాప్తంగా 7,227మంది చిన్నారులకు గాను 7,069మందికి పోలియో చుక్కలు వేసినట్లు కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. 67 కేంద్రాలను ఏర్పాటు చేసి, 267మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. మిగిలిన పిల్లలకు మరో రెండురోజులు ఇంటింటికెళ్లి చుక్కలు వేయనున్నట్లు వివరించారు. మండలకేంద్రంలో ఎంపీడీఓ పూల నరసింహులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

నల్లమాడ: మండల వ్యాప్తంగా 4,614మంది చిన్నారులకు పోలియోచుక్కలు వేసినట్లు వైద్యాధికారి గణేనాయక్ తెలిపారు. మిగిలినవారికి 4,5వ తేదీల్లో ఇంటింటికీ సిబ్బంది వెళ్లి చుక్కలు వేస్తారన్నారు. పోలియో చుక్కలకు 65 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు కేంద్రాలను డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామాంజనేయులు, సూపర్‌వైజర్లు , ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలంలోని ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 57 పల్స్ పోలియో కేంద్రాల్లో 5156 మంది చిన్నారులకు గాను 5వేల మందికి పోలియో చుక్కలు వేసినట్లు వెద్యాధికారి రాజేంద్ర తెలిపారు. అలాగే మలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 26 కేంద్రాలలో 1591 మంది చిన్నారులకు గాను 1572 మందికి పోలియో చుక్కలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆరోగ్య కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్‌కమిషనర్‌రాంకుమార్


కదిరి ఆస్పత్రి ఆవరణలో సూపరింటెండెంట్ హుస్సేన్


తాడిమర్రి మండలం నిడిగల్లులో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్


తనకల్లులో ఎంపీడీఓ పూల నరసింహులు


ముదిగుబ్బలో వైద్య సిబ్బంది


నల్లచెరువులో..


నంబులపూలకుంటలో..


ఓడీసీలో ..


నల్లమాడ మండలం చౌటకుంటపల్లిలో..

రా.. కదలిరా.. సభకు తరలిరండి: పల్లె

పుట్టపర్తి, మార్చి 3 : పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమ వద్ద సోమవారం రా కదలిరా పేరిట బహిరంగ సభ జరగనుందని, ఇందుకు టీడీపీ అధినేత చంద్రబాబు రానున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొత్తచెరువు: పెనుకొండ వద్ద కియ సమీపంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించే రా కదలిరా మహాసభకు మండలంలోని టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆపార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారిశ్రీనివాసులు, మండల, పట్టణ కన్వీనర్లు అడపాల రామకృష్ణ, ఒలిపిశీన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు తలపెట్టిన రా.. కదలిరా.. కార్యక్రమానికి మం డలంలోని టీడీపీ శ్రేణులు, మేధావులు, యువకులు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డ్రైవర్ కేశప్ప, నల్లమాడ శంకర్,సుబ్రమణ్యం,పెద్దన్న,డేగల కృష్ణమూర్తి, చంద్రమోహన్, పెద్దన్న, శివాజీ, చిరంజీవి పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: టీడీపీ అధినేత చంద్రబాబు పెనుకొండ వద్ద తలపెట్టిన రా... కదిలిరా... సభను విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. రా.. కదిలిరా... కార్యక్రమానికి మండలనుంచి వేలాదిగా కార్యకర్తలు, నాయకులు, అ భిమానులు మాజీ మంత్రి పల్లె ఆధ్వర్యంలో సభకు తరలాలని కోరారు.

నల్లచెరువు: పెనుకొండ సమీపంలో సోమవారం నిర్వహించే రా.. కదిలిరా... బహిరంగ సభను జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ పీ.రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో అందరూ తరలిరావాలని కోరారు. సభకు పార్టీ అధినేత చంద్రబాబు రానున్నట్లు చెప్పారు. .

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి


నారాయణస్కూల్‌లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఐ, స్కూల్ ఏజీఎం తదితరులు

కొత్తచెరువు, మార్చి3: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, అప్పుడే అ నుకున్నది సాధించవచ్చని నారాయణ స్కూల్ ఏజీఎం రమేశ్ బాబు, సీఐ రాజారమేశ్ సూచించారు. మండలకేంద్రంలోని నారాయణ స్కూల్ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏజీఎం, సీఐతో పాటు ప్రిన్సిపాల్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజీఎం, సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకుంటే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదవాలని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్లు ప్రేమ సాగర్‌రెడ్డి, రెడ్డిహరిత, ప్రిన్సిపాల్ గురుప్రసాద్, అకడమిక్ డీన్ విశ్వనాథ్, ఏటిరా మ్మూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

పల్స్ పోలియో కేంద్రాల తనిఖీ


చెంచుగారిపల్లిలో పల్స్ పోలియో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ముదిగుబ్బ, మార్చి3: మండలంలోని మలకవేముల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గల కొండగట్టుపల్లి, చెంచుగారిపల్లి, తప్పిటవారిపల్లి గ్రామాల్లో ఆదివారి చేపట్టిన పల్స్ పోలియో కేంద్రాలను డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0నుంచి 5ఏళ్ల లోపు వయసున్న చిన్నారులను ప్రతిఒక్కరినీ గుర్తించి పోలియోచుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య కన్సల్టెన్సీ విక్రమ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్, లెప్రసీ నివారణ అధికారి తిప్పయ్య, వైద్యాధికారులు నాగేంద్రనాయక్, లక్ష్మీ, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్: మండలంలోని దర్శినమల ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగలూరు గ్రామంలో పల్స్ పోలి యో కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియసాల్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ ఇంతవరకు ఎంతమందికి చుక్కలు వేశారని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన వారికి ఇంటింటికీ తిరిగి తప్పకుండా చుక్కలు వేయాలని సూచించారు. ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఆమె వెంట వైద్యులు విక్రమ్, చెన్నారెడ్డి, పుష్పలత, దిలీప్‌కుమార్ ఉన్నారు.

105 మందికి కంటి పరీక్షలు

ధర్మవరం, మార్చి 3: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 105 మందికి వైద్యనిపుణులు కంటి పరీక్షలు చేసి 71మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, అరుణాచలం సిల్క్స్ యజమాని సిరిగెల భాస్కర్ సహకారంతో కార్యక్రమం జరిగింది.

దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్, మార్చి 3: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆదర్శపాఠశాలలో ఆరోతరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలంటూ జగరాజుపల్లి ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి 2023-24లో 5వతరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 3 నుంచి 31వతేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్‌కార్డు, ఫొటోలతో నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా ఉందన్నారు. పరీక్ష రుసుము ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు రూ.75 చెల్లించాల్సి ఉందన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం

- జనమంతా తెలుగుదేశం వైపే..
- భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆ పార్టీ నాయకులు

ధర్మవరం, మార్చి 3: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయంగా కనిపిస్తోందని, ప్రజలంతా టీడీపీకి పట్టం కట్టేందుకు ఎదురు చూస్తున్నారని పార్టీ ధర్మవరం నియోజకవర్గ పరిశీలకుడు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 31వ వార్డులో ఆదివారం వారు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ ఆ పథకాల గురించి వివరించారు. కుటుంబంలో ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయి. వాటి వల్ల ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ... గత నాలుగున్నరేళ్లకు పైగా వైసీపీ పాలనలో రాష్ట్రంలో అవినీతి రాజ్యం ఏలిందన్నారు. రాష్ట్రాన్ని సీఎం జగన్ అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. చాలామంది అర్హులకు సైతం పథకాలు అందించలేదన్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన హామీలను వేటినీ జగన్ నెరవేర్చలేదన్నారు. అందుకే వైసీపీకి తగిన బుద్ధి చెప్పడానికి ఎదరుచూస్తున్నారని తెలిపారు. ప్ర స్తుతం జనం టీడీపీ వైపే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీ పీ ఓడిపోవడం, టీడీపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ధర్మవరంలో పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యే గెలిపించుకోవాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో నాయకులు భీ మినేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, రాళ్లపల్లి షరీఫ్, అంబటిసనత్, కరెంటు ఆది, గంగారపురవి, గోసలశ్రీరాములు, మా రుతీ స్వామి, మాధవరెడ్డి, అత్తార్ రహీంబాషా, ఉస్మాన్, బీరే శీన, గోపాల్, అశ్వర్థనారాయణ, నాగేం ద్ర, తొగట అనిల్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.


31వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి : ఆర్డీఓ

ధర్మవరం, మార్చి 3: ప్రతి ఓటరు వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఆర్డీఓ వెంకటశివారెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై మాట్లాడారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో ఇప్పటికే పారదర్శకతో కూడిన ఓటరు జాబితాను తయారు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల నాయకులు కూడా సహకారం అందించాలని కోరారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 1500 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాటిని మరొకపోలింగ్ బూత్‌కు మార్పు చేస్తున్నామన్నారు. అలాగే ప్రస్తుతం ఏర్పాటైన పోలింగ్ కేంద్రాలు శిథిలావస్థలో ఉంటే వాటిని కూడా మరో బిల్డింగ్‌కు మార్పుచేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో తాడిమర్రి మండలంలో పెద్దకోట్ల, ముదిగుబ్బ మండలంలో రామస్వామితండా, బత్తలపల్లి మండలంలో అనంతసాగరం, ధర్మవరం మండలంలో తుంపర్తి గ్రామాలలో కేంద్రాలను మార్పు చేయాల్సిందిగా గుర్తించామన్నారు. అనంతరం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలపై పలు సమస్యలను రాజకీయపార్టీల నాయకులు ఆర్డీఓ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు మేకల రామాంజనేయులు, వైసీపీ నాయకుడు గుర్రంశీన, కాంగ్రెస్ నాయకుడు రంగన అశ్వర్థనారాయణ, బీజేపీ నాయకులు నబీరసూల్, రాప్తాటి రాము, నారాయణస్వామి యాదవ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివారెడ్డి

వేపచెట్టు నరికివేతపై డీఎఫ్‌ఓకు ఫిర్యాదు

కొత్తచెరువు, మార్చి 3: మండల కేంద్రంలోని నెహ్రూనగర్ వీధిలో పంచాయతీకి చెందిన వేపచెట్టును విద్యుత్ అధికారులు అనుమతి లేకుండా నరికివేశారు. దీనిని గమనించిన పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు ఆవేదన చెందుతూ ఆదివారం డీఎఫ్‌ఓకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం చెట్లను కొందరు విచ్చల విడిగా నరికేస్తున్నారని, అందుకు వర్షాలు రాక ప్రజలతో పాటు జంతువులు ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. 40 ఏళ్ల నుంచి ఉన్న వేపచెట్టును విద్యుత్ అధికారులు అనుమతి లేకుండా నరికివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానన్నారు. సంబంధిత అధికారులు విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

శిలాఫలకం ధ్వంసం

నంబులపూలకుంట, మార్చి 3: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు భాగాన ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఆదినారాయణ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నూతన ఎంపీపీ కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఎంపీపీగా రాము ఎన్నికయ్యారు. ఎంపీడీఓ కార్యాలయానికి మరమ్మతులు జరిగాయి. దీంతో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డితో పాటు, ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీల పేర్లతో శిలాఫలకం ఏర్పాటు చేశారు. కాగా దీనిని దుండగులు ధ్వంసం చేశారు. ఎంపీపీ రాము మాట్లాడుతూ.. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ధ్వంసం చేశారన్నారు. వారిని పోలీసులు త్వరలో గుర్తించాలని కోరారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధ్వంసమైన శిలాఫలకం

రా.. కదలిరాకు సర్వం సిద్ధం



సభ ఏర్పాట్లు

- నేడు కియ వద్ద భారీ బహిరంగసభ
- హాజరుకానున్న టీడీపీ అధినేత చంద్రబాబు
- లక్ష మందితో సభకు ఏర్పాట్లు
- అభ్యర్థులను ప్రకటించాక
- ఉమ్మడి అనంతలో తొలిసభ
- ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

హిందూపురం/పెనుకొండ రూరల్, మార్చి 3: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రా కదిలిరా సభ సోమవారం పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమవద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఆయన టీడీపీ నేతలు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయనున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఏం చేస్తారో వివరించనున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందు నిర్వహిస్తున్న భారీ బహిరంగసభ కావడంతో ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని జనసమీకరణ చేస్తున్నారు. పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవితతోపాటు ఉమ్మడి జిల్లా నేతలు సభకు సర్వం సిద్ధం చేశారు.

తరలిరానున్న కార్యకర్తలు

రా.. కదిలిరా సభకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి నేతలు, కార్యకర్తలు తరలి రానున్నారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గ బాధ్యులు, ముఖ్యనేతలు జనసమీకరణలో నిమగ్నమయ్యారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలతోపాటు పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుని పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు ఈ సభ ద్వారా శ్రీకారం చుడతామని నాయకులు పేర్కొన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చి చంద్రబాబుకు అండగా నిలుస్తారని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన పొత్తు ఖరారై, సీట్లు ప్రకటించిన తర్వాత జిల్లాకు మొదటిసారిగా చంద్రబాబు విచ్చేయనున్నారు. దీంతో ఈసభకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కూడా హాజరు కానున్నారు. ఈసభ ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపుతుం దని నేతలు అభిప్రాయపడుతున్నారు.



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు, సవిత, పరిశీలకులు

లక్ష మందితో సభ

కియ వద్ద జరగనున్న రా కదిలిరా ముగింపు సభకు లక్షమందిని తరలించేవిధంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబు నిర్వహించే ఈ కార్యక్రమం ఎన్నికల సభగా ఉంటుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. సభ ఏర్పాట్లను ఆదివారం ఉమ్మడిజిల్లాల పార్టీ అధ్యక్షులు బీకే పార్థసారధి, కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్‌రెడ్డి, పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవిత, శింగనమల అభ్యర్థి శ్రావణి, జిల్లా పరిశీలకులు కోవెలముడి రవీంద్ర, పెనుకొండ పరిశీలకులు నరసింహారావు, టీడీపీ నాయకులు దేవళ్ల మురళి, సామకోటి ఆదినారాయణ, ఎల్.నారాయణ చౌదరి, రంగయ్య, తదితరులు పరిశీలించారు. కాగా బహిరంగ సభకు విచ్చేసే వారందరికీ సవిత ఆధ్వర్యంలో భోజన, తాగునీటి వసతి ఏర్పాటు చేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పరిటాల సునీత, పల్లె, పార్థసారథి



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం



ప్రజలంతా వైసీపీ పాలన ఎప్పుడు పోతుందా అని ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదన్నారు. చంద్రబాబు అభివృద్ధి ఏంటన్నది ఒక్క కియ పరిశ్రమను చూపితే చాలన్నారు. అందుకే ఇక్కడే రా.. కదలిరా సభను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జగన్ పాలనలో అన్ని ప్రాంతాల్లో భూ మాఫియాలు పెరిగిపోయాయి. అందుకే ఆ పార్టీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలు, టీడీపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

- పరిటాల సునీత, మాజీమంత్రి

ఇక్కడ సభ.. అదృష్టంగా భావిస్తున్నాం



రా కదిలిరా ముగింపు మహాసభ ఇక్కడ నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాం. చంద్రబాబు చలువతోనే కియ కార్ల పరిశ్రమ, పవన్ విద్యుత్ కేంద్రాలు జిల్లాలో ఏర్పాటయ్యాయి. కరువు జిల్లా అయిన ఉమ్మడి అనంతను ఆదుకోవా లనే సంకల్పంతోనే దేశంలోని పలు రాష్ట్రాలు పోటీపడినా అంతర్జాతీయ కియ కార్లపరిశ్రమను ఈ ప్రాంతానికి తెచ్చారు. కియ రాకతో 13వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేసి తాగు, సాగునీటిని అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. మన అందరి కోసం పాటుపడే మన నాయకుడు చంద్రబాబు వస్తున్న సందర్భంగా అన్నివర్గాల ప్రజలు రా కదిలిరా కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేద్దాం.

- పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ మంత్రి

అభివృద్ధి, సంక్షేమం తెలిసిన వ్యక్తి చంద్రబాబు



రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం తెలిసిన ఏకైక వ్యక్తి చంద్రబాబు. రాష్ట్రం విడిపోయి ఇబ్బందుల్లో ఉన్న సమయంలో నవ్యాంధ్ర సీఎంగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రాన్ని ముందుకు నడిపిన విజన్ ఉన్న నాయకుడు ఆయన. అంతర్జాతీయ కియ కార్లపరిశ్రమ ఈ ప్రాంతంలో స్థాపించడం చంద్రబాబు కృషి అమోఘం. రా కదిలిరా సభను పెనుకొండలో నిర్వహించడం, టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను నియమించడం ఎంతో అదృష్టం. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు కుదేలయ్యాయి. వైసీపీకి నాయకులు లేరు. అందుకే వలస పక్షులను ఇక్కడ పోటీకి దింపారు. ఇది ఆ పార్టీకి సిగ్గు చేటు. కళ్యాణదుర్గంలో ప్రజలు ఛీకొడితే ఓ వలస పక్షి వచ్చి పెనుకొండలో మకాం వేసింది.

- సవిత, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి

అన్ని రంగాలు నిర్వీర్యం



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాలు నిర్వీర్యమైపోయాయి. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రా కదిలిరా కార్యక్రమానికి జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలి. కార్యక్రమంలో ఎల్. నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, దేవేళ్ల మురళి, సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచ్ గుట్టూరు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

- బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

సీమ నీటి హక్కులపై కవి సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న హరి

పెనుకొండ, మార్చి 3: రాయలసీమ నీటి హక్కులపై సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక గగన్ మహల్‌లో జలకవచం కవి సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్ర మానికి సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా రాయలసీమ జలసాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి, సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు మోహన్, కవి ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవులు, రచయితలు తమ మాటలు, పద్యాలు, కవితల ద్వారా రాయలసీమ ఎదుర్కొంటున్న నీటి కరువు గురించి వివరించాలన్నారు. రాయలసీమ అడుగుతున్న నీటి హక్కులు ప్రాంతీయతత్వం కాదన్నారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన అనేక మంది కవులు, గాయకులు తమ కవితలను, పద్యాలను వినిపించారు. అనంతరం అతిథులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, కోగిర జయచంద్ర, రామన్న, యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి మధు?

ఉరవకొండ అసెంబ్లీ టిక్కెట్టు కోసం దరఖాస్తు



ఉరవకొండ, మార్చి3: మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డికి సోదరుడి రూపంలో సవాలు ఎదురు కానుంది. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓట్లను చీల్చే కార్యక్రమానికి సొంత సోదరుడే శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. వైసీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి సోదరుడు, మధుసూదన్‌రెడ్డి త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఉరవకొండ అసెంబ్లీ టిక్కెట్టు కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ అధిష్టానికి ఇటీవల ఆయన దరఖాస్తు చేసుకున్నారు. 2022 డిసెంబరులో ఉరవకొండలో జరిగిన నియోజకవర్గ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న మధుసూదన్‌రెడ్డి తన అన్న విశ్వపై బహిరంగగా ఆరోపణలు చేశారు. 'ఒకడే ఉండాలి, నేనే గెలవాలి అనే ఉద్దేశంతో ఓ నాయకుడు ఉండటం వల్లే గత ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయింది' అని అన్నారు. పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్నారు. దీంతో ఏడాది కిందట మధుసూదన్‌రెడ్డిని వైసీపీ నుంచి బహిష్కరించారు. ఆయన కొంత కాలం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టడం, రాజశేఖర్‌రెడ్డి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆ మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన షర్మిలను కలిసి ఆమెతో ప్రత్యేకంగా పలు విషయాలను చర్చించారు. టిక్కెట్టు ఖరారు చేస్తే పార్టీలోకి వస్తానని ప్రతిపాదనలు పెట్టారు. గత నెల 28న కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు కోసం దరఖాస్తు చేసుకోవడం చర్చాంనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ కూడా మధుసూదన్‌రెడ్డి అభ్యర్థి అయితే ఎలా ఉంటుందని సర్వే చేయించుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో మధుసూదన్‌రెడ్డి చేరితే టీడీపీ, వైసీపీలకు గట్టి పోటీ ఇస్తారని చెప్పవచ్చు. ఆయన కాంగ్రెస్‌లోకి చేరితే వైసీపీ పైనే తీవ్ర ప్రభావం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే వైసీపీలో అసంతృప్తిగా ఉన్న నేతలు ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారన్న చర్చ జరుగుతోంది.

గల్లంతైన ఇద్దరు విద్యార్థులు మృతి

చెన్నై విహారయాత్రలో విషాదం



మృతులు పెద్దిరాజు, శేషారెడ్డి (ఫైల్)

యాడికి, మార్చి 3: చెన్నై బీచ్‌లో గల్లంతైన అనంత విద్యార్థులు శేషారెడ్డి, పెద్దిరాజు ఇద్దరూ మృతిచెందారు. వారి మృతదేహాలను సముద్రం నుంచి రెస్క్యూ టీం ఆదివారం వెలికి తీసింది. దీంతో వారి స్వగ్రామాల్లో విషాదం నెలకొంది. మండలంలోని పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్స్ సైన్సెస్ విద్యార్థు లు శుక్రవారం విహార యాత్రకు వెళ్లారు. వీరిలో ఇద్దరు శనివారం ఉదయం చెన్నై బీచ్‌లో సముద్రంలోకి వెళ్లి.. అలల తాకిడికి కొట్టుకుపోయారు. రెస్క్యూటీం వారి కోసం గాలించి నా ఫలితం లేకపోయింది. విషయం తెలియగానే విద్యార్థుల కుటుంబ సభ్యులు చెన్నైకి వెళ్లారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తా మని అక్కడి అధికారులు తెలిపారు. యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దిరాజు, పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల గ్రామానికి చెందిన శేషారెడ్డి పెన్నా కాలేజీలో డిప్లొమా చివరి సంవత్స రం చదువుతున్నారు. చేతికి వచ్చిన బిడ్డలు మృత్యువాత పడటంతో ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.



శోకసంద్రంలో పెద్దిరాజు తల్లి, బంధువులు

బియ్యం, చక్కెరతోనే సరి !

- మిగతా రేషన్ సరుకులకు కోత
- కందిపప్పు ఎప్పుడు ఇస్తారో తెలియని వైనం
- చతికిలపడిన సరుకుల పంపిణీ
- ఇబ్బంది పడుతున్న పేద వర్గాలు



ధర్మవరం, మార్చి 3: వైసీపీ పాలనలో చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు బియ్యం, చక్కెర మాత్రమే అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం బియ్యం ఇస్తుండగా, మార్కెట్ ధరతో సమానంగా అర కేజీ చక్కెర కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ రెండు సరుకులు కోసం ఎండీయూ వాహనం, దానికో సైరన్, డ్రైవర్, మరో సహాయకుడు. వీధుల్లో ఆ వాహనం వద్ద కార్డుదారుల క్యూ..ఇదీ ప్రస్తుతం రేషన్ పంపిణీ తీరు. దీనిపై ప్రతి పక్షాలు, కార్డుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాను అధికారంలోకి వస్తే సన్నబియ్యంతో పాటు నిత్యావసర సరుకులను పేదలకు డోర్ డెలివరీ చేస్తానని వైసీపీ అధినేత జగన్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చి దాదాపు ఐదేళ్లు అవుతున్నా ఇప్పటికీ బియ్యం, చక్కెర మాత్రమే పేదలకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కందిపప్పు ఒక నెల ఇస్తే మళ్లీ ఎప్పుడు ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. అది కూడా అందరికీ కాకుండా కొందరికి మాత్రమే అందుతుంది. ఎవరైనా కార్డుదారులు కందిపప్పు కావాలని అడిగినా లేదనే సమాధానం ప్రతీనెల ఎండీయూ వాహనదారుల నుంచి వస్తుంది. గోధుమ పిండి ప్యాకెట్లు అరకొరగా ఇస్తున్నా అవి కొద్ది రోజులకే పురుగు పడుతున్నాయి. దీంతో వినియోగదారులు వాటిని తీసుకోవడం లేదు. పామాయిల్ అసలే ఇవ్వడంలేదు. బియ్యానికి బదులుగా రాగులు/సజ్జలు/జొన్నలు ఇచ్చేవారు. వాటికి కూడా వైసీపీ ప్రభు త్వం శుభం కార్డు వేసింది. ఇలా పేదలకు రేషన్ సరుకుల్లో కోతపెట్టి సబ్సిడీ రూపంలో భరించాల్సిన నిధులను దారి మళ్లిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేదలపై ఆర్థిక భారం

ప్రభుత్వ తీరుతో ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. కిలో కందిపప్పు రకాలను బట్టి బహిరంగ మార్కెట్‌లో రూ.170 పలుకుతోంది. రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తే పేదలపై ఆర్థిక భారం తగ్గేది. టీడీపీ పాలనలో ప్రతినెల కిలో కందిపప్పు రూ.40లకే సరఫరా చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ధరను రూ.67కి పెంచింది అయినా అందరికీ కందిపప్పును సక్రమంగా ఇవ్వడంలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కిలో పంచదార రూ.14కు ఇచ్చేవారు. జగన్ దానిని అరకిలోకు పరిమితం చేశారు. పైగా ధరను మార్కెట్ ధరతో సమం చేశారు. అప్పుడు రాగులు, జొన్నలు వంటివి కూడా రాయితీపై కార్డుదారులకు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ ఊసే లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కన్ఫర్మేషన్ కొట్టేదెలా?



స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు

- ఆసరా సొమ్ము అందకపోయినా కన్ఫర్మేషన్ కొట్టాలట !
- ఎన్నికల వేళ అధికార పార్టీ ఒత్తిళ్లు
- ఇప్పటిదాకా 30శాతం మందికే సొమ్ము జమ
- బయటకు చెబితే ఉద్యోగాలు ఊడతాయని బెదిరింపులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 3: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభు త్వం డ్వాక్రా సంఘాల మహిళలకు అందిస్తున్న ఆసరా సొమ్ము పడకనే ..పడినట్లు కన్ఫర్మేషన్ కొట్టాలంటూ ఒత్తిడి చేయడం వివాదంగా మారుతోంది. ఇప్పటికే అక్కా చెల్లెమ్మలు, డీఆర్‌డీఏ-వైకేపీ సిబ్బందిని అధికారులు సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు అంగీకరించాలని ఆదేశించడం గమనార్హం. జనవరి 23న ఉరవకొండలో సీఎం జగన్ 30వేల సంఘాలలోని 3లక్షల మంది సభ్యులకు రూ.236 కోట్ల నిధుల చెల్లింపునకు బటన్ నొక్కారు. 45రోజులు గడుస్తున్నా 30శాతం మందికి మాత్రమే బ్యాంకు అకౌంట్లలోకి నగదు జమ చేశారు. మిగిలిన సభ్యులకు ఎప్పుడు పడుతుందో చెప్పలేని పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆసరా సొమ్ము ఆలస్యం చేయడంతో అనేక అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో సొమ్ము పడకపోయినా పడినట్లు కన్ఫర్మేషన్ కొట్టాలని ఒత్తిడి చేయడం పట్ల సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అమౌంట్ పడకనే అకౌంట్లలోకి పడిందని ఎలా చెప్పే దంటూ సిబ్బంది, మహిళలు ప్రశ్నిస్తుండడం అధికారపార్టీ నేతలకు మింగుడుపడటం లేదు. దీంతో ఎవరైనా విషయాన్ని బయటకు చెబితే ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ప్రభుత్వ విధుల్లో రాజకీయ నేతల జోక్యంపై సిబ్బంది, మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చెందాల్సిన పనిలేదు



ఆసరా సొమ్ముకు సంబంధించి అర్హులైన స్వయం సహాయక సంఘాల మహిళలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. వైఎస్సార్ ఆసరా పథకం సొమ్ము చెల్లింపులు చేస్తాం. సాంకేతిక సమస్యలతో సొమ్ము బ్యాంకు ఖాతాలో జమకావడానికి ఆలస్యమవుతోంది. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి చెల్లింపులు చేస్తు న్నాం. విడతల వారిగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తాం. ఇందులో ఎటువంటి సందేహం లేదు. లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో సొమ్ము జమచేసిన తరువాతే కన్ఫర్మేషన్ కొట్టాలి.

- నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

వైసీపీ ఓట్ల దొంగాట: సీపీఐ



మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, మార్చి 3: రాష్ట్రంలో వలంటీర్లు, దొంగ ఓట్లు, డబ్బులతో ఎన్నికలను ప్రభావితం చేయాలని వైసీపీ చూస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే... అధికార పార్టీ రాష్ట్రంలో కుక్కర్లు, దుస్తులు, డబ్బులు పంచుతూ... తాయిళాలతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశరాజకీయ వ్యవస్థకున్న విలువలను దిగజారుస్తున్నాడన్నారు. ప్రతిపక్ష పార్టీలపై బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. జగదీష్ మాట్లాడుతూ ఓటరు జాబితాలోని తప్పులను ఎత్తిచూపినా... ఏమాత్రం సవరణ చేయడం లేదన్నారు. డబుల్ ఎంట్రీలు, వలసలు, మరణించిన వారిని తొలగించాలని అర్జీలు ఇచ్చినా తొలగించలేదన్నారు. ఒక్కో ఇంట్లో 50 ఓట్లు ఉన్నా తొలగించకుండా చోద్యం చూస్తున్నారంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఇతర నాయకులు లింగమయ్య, శ్రీరాములు, పద్మావతి, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

- సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నారు. నగరంలోని వీకే మెమోరియల్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతోపాటు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి నాయకులు హాజరుకానున్నారు.

నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు: బంగి మల్లేష్



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బంగి మల్లేష్

ధర్మవరంరూరల్, మార్చి 3: తనను కిడ్నాప్ చేసినట్లు వస్తున్న వార్తలు నిరాధారమని కనగానపల్లి మండలం తూముచెర్ల సర్పంచ్ బంగిరేణుక భర్త మాజీ సర్పంచ్ బంగి మల్లేష్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి అనంతపురంలోని మాజీమంత్రి పరిటాలసునీత నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఓ ప్రభుత్వ భూమికి సంబంధించిన విషయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు చందుని కలిసిన మాట వాస్తవమని చెప్పారు. ఆయన సూచన మేరకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని కలిశానని, ఆ సమయంలో ఎమ్మెల్యే తనకు వైసీపీ కండువా వేశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు, మా శ్రేయోభిలాషులు, నా సతీమణి రేణుక తీవ్ర ఆవేదనకు లోనయ్యారని వెల్లడించారు. అందుకే నేను చేసిన తప్పు తెలుసుకుని మళ్లీ పరిటాలసునీత, శ్రీరామ్‌వద్దకు వచ్చి జరిగిందంతా వివరించానని తెలిపారు. సాయంత్రం పరిటాల సునీత ఇంటివద్దనే ఉన్నానన్నారు. ఈలోపే తాను కిడ్నాప్ అయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. నేను పరిటాలసునీత ఇంట్లోనే ఉన్నానని నేను చేసిన తప్పుకు వారికి క్షమాపణ చెబుతున్నట్లు మల్లేష్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ యాతంపోతలయ్య, నాయకులు ఆదెప్ప, మల్లికార్జున, జగదీష్, బిల్లేదాము, రాజాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్

లేపాక్షి, మార్చి 3: మహాశివరాత్రి సందర్భంగా లేపాక్షిలో నిర్వహించే దుర్గా, పాపనాసేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ అన్నారు. రథోత్సవంలో వందమంది వలంటీర్ల ద్వారా సేవలు అందిస్తామన్నారు. రథోత్సవానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా వారు స్వచ్ఛందంగా సేవలందిస్తారన్నారు. ఈ నెల 7నుంచి 11వరకు నిర్వహించే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా రథోత్సవం రోజున కేరళ, కళాకారులతో నృత్యాలు చేయిస్తామని, పల్లకి రోజున కీలుగుర్రాలు, జబర్దస్త్ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రథోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు.


పురంలో పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం


పరిగిలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


పెనుకొండలో
పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి


గుట్టూరులో.. వైద్యాధికారి నాగరాజునాయక్

నిండు ఆరోగ్యానికి రెండు చుక్కలు

నిండు ఆర్యోగ్యం కోసం 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు రెండు చుక్కలు పోలియో చుక్కలు వేయించాలని పలువురు సూచించారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల వ్యాప్తంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించినట్లు స్థానిక వైద్యాధికారులు పేర్కొన్నారు.

హిందూపురం అర్బన్, మార్చి 3: పట్టణ వ్యాప్తంగా మొత్తం 55 కేంద్రాలు, 3 ట్రాన్సిస్ట్ పాయింట్లు, మొబైల్ టీం ఏర్పాటు చేశామని హిందూపురం ప్రభుత్వాసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ ఆనంద్‌బాబు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. న్నారు. మొత్తం 11,672 మందికి చిన్నారుల కు గాను 11,181 మందికి పోలియో చుక్కలు వేసి 95.7 శాతం పూర్తి చేశామన్నా రు. మిగిలిన పిల్లలకు ఇంటింటి సర్వే చేసి గుర్తించి పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా హిందూపురం మండలంలో 11,440 మంది చిన్నారులకు గాను 10968 మందికి పోలియో చుక్కలు వేశారు. మొదటిరోజు 98 శాతం పూర్తి చేశామని డాక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పరిగి మండలంలోనూ పోలియో చుక్కలు వేశారు.

పెనుకొండ : పట్టణంలో ఆదివారం 15కేంద్రాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, పిల్లలకు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం 2319మందికి వేయాల్సి ఉండగా లక్ష్యాన్ని మించి 2353మందికి చుక్కల మందు వేసినట్లు తెలిపారు.

లేపాక్షి : మండల వ్యాప్తంగా ఆదివారం 98శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి వెంకట చిరంజీవి తెలిపారు. మండలంలో 5118 మంది చిన్నారులుండగా మొదటి రోజు 5017మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మండలవ్యాప్తంగా 45పోలియో బూత్‌లు, ఒక మొబైల్ వ్యాను, బస్టాండు వద్ద అదనంగా ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గోరంట్ల : మండలంలోని 47 కేంద్రాల ద్వారా ఆదివారం 4,961మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి స్మృతి తెలిపారు. మండలంలో ఐదేళ్ల లోపు చిన్నారులు 4,990మంది ఉండగా, 99.41శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. పల్స్ కేంద్రాలను ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు.

పెనుకొండ రూరల్ : మండల వ్యాప్తంగా 4250మంది చిన్నారులుండగా 4050మందికి ఆదివారం పోలియో చుక్కలు వేయించినట్లు గుట్టూరు వైద్యాధికారి నాగరాజునాయక్ తెలిపారు. 95శాతం పోలింగ్ నమోదైందన్నారు.

చిలమత్తూరు: మండల వ్యాప్తంగా 5994 మంది చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ తేజశ్విని తెలిపారు. 6120 మంది చిన్నారులను లక్ష్యంగా చేసుకున్నట్లురు. మండపరిధిలో 84 కేంద్రాలు, 9 రూట్లలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు.

అగళి: మండలంలోని పీ బ్యాడిగెర గ్రామ సచివాలయం వద్ద పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 3481మంది చిన్నారులుండగా ఆదివారం 3412మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ శివానంద తెలిపారు.

గుడిబండ : మండలంలోని 0-5సంవత్సరాల చిన్నారులు 4714మంది కి ఆదివారం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి సౌందర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య వైద్య సిబ్బంది, ఆశా, అంగనవాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


లేపాక్షిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎస్ఐ గోపి


గోరంట్లలో వైద్య సిబ్బంది..


మల్లాపల్లిలో పల్స్ పోలియో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్


అగళిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

అరటి పంటకు నిప్పు

- రూ.8లక్షల ఆస్తి నష్టం
- లబోదిబోమంటున్న రైతు


అగ్నికి ఆహుతైన అరటి పంట

రొళ్ల, మార్చి 3: ఆరుకాలం శ్రమించి తీరా చేతికొచ్చే సమయంలో పంటఅగ్నికి ఆహుతై పోతుంటే చూసి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఆ రైతు ఆవేదన అంతా ఇంతా కాదు. రొళ్ల మండలం ఎం రాయాపురానికి చెందిన రైతు నాగేంద్రప్ప తన మూడు ఎకరాల పొలంలో అరటి పంట సాగు చేశాడు. ప్రస్తుతం కోత దశలో ఉంది. అయితే ఆ అరటి పంటకు శుక్రవారం రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నిప్పుకు మొత్తం చెట్లతోపాటు డ్రిప్ పరికరాలు, చేతికొచ్చిన పంట పూర్తిగా కాలిపోయిందని ఆ రైతు కన్నీరుమున్నీరుగా ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట నోటికి అందకుండా కాలిపోయిందని, తనను ఆదుకోనే నాథుడు ఎవరు అని ఆ రైతు వేదన చూపరులను కంటతడి పెట్టించింది. మొక్క స్థాయి నుంచి పంట స్థాయి వరకు వాటికి నీరు, మందులు, కూలీలు, డ్రిప్ సౌకర్యం తదితర వాటికి దాదాపు రూ.8లక్షలు ఖర్చు పెట్టానని, ఇప్పుడు పూర్తిగా నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరాడు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి

అగళి, మార్చి 3: మండలంలోని నరసంబుది మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి శివకుమార్(40) మృతిచెందినట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు. ఏఎస్ఐ అందించిన వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా దొడ్డేరి హబిలి తిమ్మా పురానికి చెందిన సిద్దరాజు, శివకుమార్, శివన్న తిమ్మాపురం నుంచి ద్విచక్రవాహనంలో అగళి మండలం మధూడి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో అగళి మండలకేంద్రానికి దగ్గరలో ఉన్న నరసంబుది మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో ముగ్గురూ కిందపడ్డారు. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు తీవ్రగాయాలు కావడం తో అక్కడికక్కడే మృతిచెందాడు. సిద్దరాజు, శివన్నకు రక్తగాయాలయ్యాయి. మృతుడికి భార్య సౌమ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, కారుతో పోలీసులు

చిలమత్తూరు, మార్చి 3: కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకువస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని, దానిని రవాణా చేస్తున్న కారును సీజ్ చేసినట్లు ఎస్ఐ గంగాధర్ ఆదివారం తెలిపారు. కొడికొండ చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి వచ్చిన ఏపీ-03, టీవి-1143 నంబరు కారులో 9 బాక్సుల్లో 864 మద్యం టెట్రా ప్యాకెట్లు లభించాయన్నారు. మద్యంతో పాటు కారును స్వాధీనం చేసుకొని దానిని తరలిస్తున్న శెట్టిపల్లికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి అతడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

కుక్కల దాడితో 14 గొర్రెల మృతి


గొర్రెల కళేబరాలు

మడకశిర రూరల్, మార్చి 3: మండలంలోని బుళ్ళసముద్రం గ్రామంలో ఆదివారం సాయంత్రం కుక్కలు దాడిచేసి తన గొర్రెలదొడ్డిలోని 14 గొర్రెలను చంపివేసినట్లు గొర్రెల కాపరి శ్రీనివాసులు తెలిపాడు. తనకు 30 దాక చిన్నపెద్ద గొర్రెలు ఉన్నాయన్నాడు. వాటిని ఉదయం మేతకు తీసుకెళ్లి, సాయంత్రం గొర్రెలదొడ్డిలోకి తోలానన్నాడు. ఈ సమయంలో గొర్రెలుదొడ్డిలోకి కుక్కలు ప్రవేశించి గొర్రెలు పైదాడిచేసినట్లు తెలిపాడు. కుక్కల దాడిలో 14 గొర్రెలు మరణించడంతో తాను రూ.80 వేలు వరకు ఆర్థికంగా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. పశువైద్యాధికారులు పరిశీలించి ఆర్థికంగా తనకు న్యాయం చేయాలని కోరాడు.

రా... కదలి రా... సభ చరిత్రలో నిలిచిపోవాలి

టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్


మాట్లాడుతున్న టీడీపీ అబ్జర్వర్ గోవర్ధన్‌రెడ్డి, పాల్గొన్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, మార్చి 3: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పెనుకొండ నియోజకవర్గం కియ పరిశ్రమ వద్ద నిర్వహించే రా కదలి రా సభ చరిత్రలో నిలిచిపోవాలని టీడీపీ నియోజకవర్గం పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మడకశిరకు వచ్చిన సందర్భంగా ఆర్అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ నియోజకవర్గం అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరం అన్నారు. రాష్ట్రం గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోందన్నారు. అభివృద్ధి ఆగిపోవడం, అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రకృతి సిద్ధమైన ఇసుక లాంటి వాటిని కూడా వైసీపీ నాయకులు దోపిడీ చేస్తూ సొమ్ముచేసుకొంటున్నారని, ప్రశ్నించినవారిపై అక్రమ కేసులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడితేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని ఇప్పటికే ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. రా కదలి రా సభకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి దిగ్విజయం చేయాలన్నారు.

టీడీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా సాగుదాం

టీడీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని టీడీపీ నియోజకవర్గం పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం పట్టణంలోని చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అన్ని రకాలుగా ఆలోచించి అభ్యర్థిత్వాన్ని నిర్ణయించారని, చంద్రబాబు నిర్ణయం మేరకు అందరం పనిచేసి టీడీపీ అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దామన్నారు. అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న తదితరులు మాట్లాడుతూ... రా కదలి రా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా నియోజకవర్గంలో గత టీడీపీ హయాంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు 80, 90 శాతం స్థాయిలో ఆగిపోయాయని, వాటిని పూర్తి చేసి నియోజకవర్గం అభివృద్ధికి మరింత కృషి చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వివరించాలన్నారు. ఈకార్యక్రమంలో వక్కలిగ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వీఎం పాండురంగప్ప, మాజీ ఎంపీపీ ఆదినారాయణ, అశ్వత్థరామప్ప, నాయకులు ఉగ్ర నరసింహ, మంజునాథ్, రామాంజనేయులు, ఓబుళేశు, మాధవరాజు, ప్రకాష్, ఓబన్న, నాయకులు పుల్లయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు తప్పక వేయించండి

చిన్నారులకు చుక్కలు వేసిన సవిత, సునీల్‌కుమార్, రఘువీరారెడ్డి



కోగిర బస్టాండులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సవిత

రొద్దం, మార్చి 3 : గ్రామీణ ప్రాంతంలోని 0-5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించి, వారి ఆరోగ్యాన్ని కాపాడాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె ఆదివారం రొద్దం మండల పరిధిలోని కోగిర బస్టాండు ఆవరణంలో చిన్నారులకు పోలియో చుక్కలువేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారికి నిండు జీవితాన్ని ప్రసాదించాలని కోరారు. మండలంలో 57 పోలియోచుక్కల కేంద్రాలు, ఒక మొబైల్ వ్యాన్, బహిరంగ ప్రదేశాల్లో ఆరు రూట్ల ద్వారా మొత్తం 4670మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రమ్య, ప్రవీణ్, భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. కోగిర గ్రామంలో టైలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


అమరాపురంలో చుక్కలు వేస్తున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్: ఐదేళ్ల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి పోలియో వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గం అభ్యర్థి సునీల్‌కుమార్ అన్నారు. పల్స్‌పోలియో సందర్భంగా ఆదివారం అమరాపురం మండల కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 321 కేంద్రాలను పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. నియోజకవర్గంలో 26,523 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


నీలకంఠాపురంలో చుక్కలు వేస్తున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్: మండలవ్యాప్తంగా 121 కేంద్రాల్లో 9289 మంది చిన్నారు లకు గాను 97 శాతం మందికి మొదటి రోజు ఆదివారం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు మాధుర్య, భార్గవి తెలిపారు. మిగిలిన 3శాతం చిన్నా రులకు సోమ, మంగళ వారాల్లో ఇంటింటికి వెళ్లి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. నీలకంఠాపురంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

బాలయ్యకు ఘన సన్మానం


బాలయ్యను సన్మానిస్తున్న ప్యారుసాబ్

హిందూపురం అర్బన్, మార్చి 3: స్థాని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఆదివారం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ పురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తరువాత తొలిసారిగా ఆయన పట్టణానికి వచ్చిన సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం మైనార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో కలిసి బాలయ్యను ఘనంగా సన్మానించారు. ప్రజల కోసం పరితపించే మంచి నాయకుడిగా నియోజకవర్గ ప్రజలల్లో చెరుగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.

ప్యారుసాబ్ కుటుంబానికి అండగా ఉంటా: బాలకృష్ణ

ఇటీవల పట్టణంలోని గడ్డమీద ప్రాంతంలో చిన్న పాటి గొడవ జరిగింది. వైసీపీ వర్గీయులు గొడవపడ్డారు. ఈ ఘటనతో సంబంధంలేని టీడీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు హిదాయత్, ఆయన తమ్ముడు ఇందాద్‌ను టార్గెట్ చేసి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారని వారి తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ప్యారుసాబ్ బాలయ్యకు తెలియ జేశారు. దీనిపై బాలయ్య మాట్లాడుతూ ప్యారుసాబ్ కుటుంబానికి తాను అండాగా ఉంటానన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిపై కక్షధోరణి అవలంభిస్తున్న విషయం తెలుసన్నారు. పార్టీ మారాలని వారిపై ఒత్తిడి చేసినా టీడీపీపై ఉన్న ప్రేమతో కష్టాలను ఓర్చుకున్నారని ఆపద సమయంలో ఆ కుటుంబానికి తాను అండాగా ఉంటానన్నారు. అదే విధంగా టీడీపీ కార్యకర్తలకు వెన్నంటి ఉంటానన్నారు. టీడీపీత్వరలో అధికారంలోకి వస్తుందని అంత వరకు ఓపిక పట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్, రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజనప్ప, మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎంఎస్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇనగలూరులో తాగునీటి సమస్య


మూతబడిన ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంటు

అగళి, మార్చి 3 : మండలంలోని ఇనగలూరులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆ గ్రామస్థులు కేతప్ప, మంజునాథ్, నరసింహప్ప, రాజు, లక్ష్మమ్మ, రామాంజమ్మ, తదితరులు తెలిపారు. ఆరు నెలలుగా ఎన్టీఆర్ సుజల స్రవంతి నీరు రావడం లేదన్నారు. అది చెడిపోయినా నేటికీ మరమ్మతులు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజల తాగునీటి కోసం ఎన్టీఆర్ సుజల స్రవంతిని ఏర్పాటు చేశారు. అది పనిచేయక తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటిని ప్రజలకు అందించాలని కోరారు.

రా.. కదిలి రా.. సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు

హిందూపురం అర్బన్, మార్చి 3: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన రా.. కదలి..రా సభకు హిందూపురం నుంచి భారీగా తరలి వెళ్లనున్నారు. పట్టణం నుంచి సోమవారం 12 గంటలకు దాదాపు 500 వాహనాల్లో పెనుకొండలో జరుగు చంద్రబాబు సభకు బయలుదేరనున్నారు. హిందూపురం నుంచే కాకుండా చిలమత్తూరు, లేపాక్షి మండలాల నుంచి కూడా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పురం ఎమ్మెల్యే బాల కృష్ణ ఇంటి వద్ద నుంచి వాహనాలు తరలనున్నాయి. పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని టీడీపీ హిందూపురం కార్యాలయం నుంచి నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ

గోరంట్ల, మార్చి 3: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో ఉన్న శ్రీసత్యసాయి టైలరింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ఐదుగురు మహిళలకు ఆదివారం కుట్టు మిషన్లను ఉచితంగా అందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు దేవాంగం జగదీశ్వర్ ఆధ్వర్యంలో సత్యసాయి టైలరింగ్ సెం టర్ ద్వారా మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గోరంట్లకు చెందిన లక్ష్మి, జయలక్ష్మి, సునిత, రేఖ, సుజాతలు ఇటీవల తమ శిక్షణ పూర్తి చేసుకున్నారు. సత్యసాయి భక్తుల సహకారంతో కొత్తచెరువులోని భజనమండలి కార్యాలయంలో వారికి డీఈఓ మీనాక్షి చేతులమీదుగా అందించారు.

యువతే.. దేశ భవిత

- శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి
- జాబ్‌మేళా ద్వారా 700 మందికి ఉద్యోగాలు


స్వామీజీ నుంచి నియామక పత్రాలు పొందిన యువత

హిందూపురం అర్బన్, మార్చి 3: యువతే దేశ భవిత అని శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ... దేశంలో చదువుకుని నిరుద్యోగులుగా ఉన్నా యువతకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తే దేశం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. హిందూపురం ప్రాంతంలోని చాలా మంది యువత మంచి చదువులు చదివి ఉద్యోగ, ఉపాధి కోసం బెంగళూరు లాంటి మహా నగరాలకు వెళ్తున్నారని తెలుసుకున్నానని అన్నారు. వారికి మంచి భవిష్యతు అందించాలనే సంకల్పంతో ఇక్కడ తొలివిడ త జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. అత్యున్నతమైన 54 కంపెనీల వారు ఇంటర్వ్యూలు నిర్వ హించి 700 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. వారందరికి నియామక పత్రాలు అందించారన్నారు. వారు ప్రతిభ కనబరిచి అంచెలంచెలుగా ఎదగాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూలకు వచ్చినయువత, ఎంపికైన వారు స్వామీజీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

గోరంట్ల, మార్చి 3: స్థానిక ఏఎన్‌కే డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కసిరెడ్డిలపల్లిలో శ్రమదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామంలోని ప్రాథమి పాఠశాలలోని వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశారు. గ్రామంలో పిచ్చి మొక్క లు, కంపచెట్లు, అపరిశుభ్రతను తొలగించారు. పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఆదినారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

చిలమత్తూరు, మార్చి 3: మండలపరిధిలోని మరవకొత్తపల్లి బీసీ కాలనీలో కొన్నాళ్లుగా తాగునీటి సమస్య తీవ్రమైందని, వెంటనే సమస్య పరిష్కరించాలంటూ స్థానికులు రోడ్డెక్కారు. గ్రామంలోని లేపాక్షి- కొడికొండ చెక్‌పోస్టు 544-ఈ రహదారిపై ఆదివారం కాలనీ వాసులు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. వారికి సీపీఐ, సీపీఎం నాయకులు మద్దతు పలికారు. కాలనీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, తాగునీటి పథకం మోటారు పనిచేయని కారణంగా సమస్య వస్తోంద న్నారు. వెంటనే కాలనీలో కొత్తబోరు ఏర్పాటుచేసి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జాతీయ రహదారికి ఆనుకొనే నివాస గృహాలు ఉన్నాయని, వాహనాల తాకిడి ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వారం రోజుల కిందట ఇదే ప్రాంతంలో ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇక్కడ ప్రమాదాల నివారణకు స్పీడు బ్రేకర్లు వేయాలని ఆందోళన చేపట్టినా అధికారులు పట్టించుకోలే దన్నారు. కాలనీ వాసుల ఆందోళనతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని కాలనీ వాసులను శాంతిపర్చే చర్యలు చేపట్టారు. కాలనీలో తాగునీటి సమస్య, జాతీయ రహదారి పై స్పీడు బ్రేకర్ల విషయం గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కా రమయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీ వాసు లు ఆందోళన విరమించారు.


రోడ్డుపై బైటాయించిన మరవకొత్తపల్లి బీసీ కాలనీ వాసులు